మనుష్యులలో పడేయాలని జమీందారిణి మళ్ళీ వివాహం చేసుకోమని ఎన్ని విధాల నచ్చచెప్పి బతిమిలాడింది. వంశం నిర్వంశం అయిపోతుందని ఎంతో వ్యధగా చెప్పింది. తల్లి మాటలకి రంగారావు విషాదంగా నవ్వి తల అడ్డంగా ఆడించి వెళ్ళి పోయాడు. మరీ తల్లి బతిమిలాడగా 'అదిజరిగే పని కాదమ్మ—పదేపదే చెప్పి నన్ను విసిగించకండి—' అని మొహం తిప్పుకుని వెళ్ళిపోయాడు. ఇంకా తల్లి ఏం చెయ్యగలదు? ఆ లంకంత భవనంలో తల్లి ఒక మూల. కొడుకు ఒక మూల. రోజులు గడప సాగారు.

*       *       *

నాలుగురోజుల క్రిందట మద్రాసునుంచి వచ్చిన రంగారావు మళ్ళీ ప్రయాణం అవుతున్నాడన్న వార్త విని జమీందారిణి ఊరుకోలేక కొడుక్కి కబురంపింది.

"పెద్దమ్మగారు తమర్ని వచ్చి కనపడమన్నారు బాబూ" దాసి వచ్చి కబురు చెప్పింది— డ్రెస్సుఅవుతున్న రంగారావు "వస్తున్నానని చెప్పు" అన్నాడు.

"బాబూ ఏమిటిది—నాలుగు రోజులక్రితం పదిరోజులు తిరిగి తిరిగి వచ్చావు. యిప్పుడు మళ్ళీ ఎక్కడికీ ప్రయాణం. అలా తిరుగుతూంటే నీ ఆరోగ్యం ఏమవుతుందో ఆలోచించావా—మిగిలిన వాడివి నీ ఒక్కడివీ నాకళ్ళముందే నీవిలా అయిపోతూంటే నేనెలా సహించను" వృద్ధ జమీందారిణి గొంతు రుద్ధమయింది. "రంగారావు దోషిలా తలదించుకున్నాడు. "అద్దంలో ఒకసారి నీమొహం చూసుకోబాబూ—ఆకళ్ళక్రింద నలుపుచూడు—ఆ కళ్ళెంత లోతుకుపోయాయి—నిన్నిలా చూస్తుంటే నా గుండె తరుక్కుపోతుంది. పోయినవాళ్ళతో మనమూ పోలేం బాబూ—గుండె దిటవు పరుచుకోవాలిగాని దొత్తిగా యిలా అయిపోయి ఎలా నాయనా—సంవత్సరం అయింది యింకెన్నాళ్ళు యిలా నిద్రాహారాలు లేకుండా కృంగిపోతావు—మరిచిపోవాలి బాబూ.

"ఎలా మరిచిపోనమ్మా—కళ్ళు తెరిచినా మూసినా బాబే కనిపిస్తున్నాడు—నమనాతో ఒక్కమాట చెప్పకుండానే వెళ్ళిపోయింది. యిదంతా ఎలా మరవను—ఎవరి కోసం బతకాలమ్మా యింకా" అంత ధృడమైన మనిషి, అంత ఆజాను బాహువూ పసివాడిలా కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"నేనింకా బ్రతికే వున్నారా బాబూ—నాకోసం—వాకు కొరివిపెట్టాల్సిన నీవే యిలా మాటాడితే నేనేమై పోవాలి నాయనా. చెట్టంతకొడుకుని వంశాంకురమైన పసి

వాడిని_మహాలక్ష్మిలాంటి కోడల్ని పొట్టన పెట్టుకుని నేనింకా బతికేవున్నారా నాయనా నాకోసమైనా నీవు సంతోషంగా వుండాలి నాయనా."

"హు_ఆనందం_సంతోషం_ అవి ఇంక ఈ జన్మకి మళ్ళీ దొరకవమ్మా-" జమీందారిణి యింకే మనగలదు-నిట్టూర్చింది "అస్తమానం యిలా యిల్లు పట్టకుండా తిరగకు నాయనా_నామాట విని ప్రయాణాలు మానుబాబూ."

"లేదమ్మా ఈ ఇంట్లో నేనుండలేనమ్మా_ యీ నిశబ్దం నన్ను పిచ్చివాడ్ని చేస్తూంది. నన్ను వెళ్ళనీయండి అడ్డు చెప్పకండి" రంగారావు తల్లిని మరోమాట అనే అవకాశం యీయకుండా చరచర వెళ్ళిపోయాడు.

బయట కారు శబ్దంవిని జమీందారిణి నిట్టూర్చి పక్కమీద వాలింది.

* * *

మద్రాసులో రంగారావుగారికి చాలామంది స్నేహితులున్నారు. ఆయన ఎప్పుడూ ఓ పెద్దహోటల్లో బసచేస్తారు. ఆయనకి కలిగిన దుఃఖం మరిచి పోవడానికి అలా తరుచు వస్తున్నాడన్న సంగతి వాళ్ళకి తెలుసు. అంచేతే ఆయనచుట్టు మిత్ర బృందం వుంటూనే వుంటుంది- డబ్బుండాలేగాని, విలాసాలకి, వినోదాలకి ఏంలోటు! ఆయనచేత తాగుడు పేకాట-డాన్సులు-పార్టీలకి ఖర్చుపెట్టిస్తూ ఆయన ఖర్చుతో వారంతా వినోదిస్తూ ఆయన్ని వినోదింపచేస్తున్నాం అని తృప్తిపడేవారు. ఆయన ఆనందిస్తున్నట్టు పైకి కనిపించేది అంత నటన అనిఆయన అంతరాంతరాలలో ఆయన బాధ మరిచిపోలేదన్న సంగతి వాళ్ళకుతెలియదు. ఎన్నోసార్లు ఆయన గదికి ఎందరో అందమైన విలాసవతులను పంపేవారు. రంగారావుకెప్పుడూఅలాంటిభోగలాలస లేదు. ఈనాడు భార్య లేకపోయినా ఆయన దృష్టి మరే స్త్రీ మీదికి మళ్లేదికాదు - అలాంటి సుఖం కావాలని ఆయన కోరుకోనూలేదు. అంచేత రానురాను ఆ మిత్రులు వారి పార్టీలు_వారి సహవాసపట్ల ఆయనకి విముఖత కల్గింది. అంచేత ఈ మధ్య ఆయన తన బస మరొక హోటలుకి మార్చేశాడు. తాగడం లేదా బీచివడ్డున వచ్చి పోయే వారిని చూస్తూ కూర్చోడం_కారు తీసుకుని రోడ్లు అన్ని తిరగడం - దైనందిన కార్యక్రమం అయింది.

ఆరోజూ అలా గమ్యంలేకుండా పరధ్యానంగా కారు నడపుతూ వెడుతున్నా రాయన. వీధి మలుపుదగ్గిర హారన్ మోగించకుండానే చటుక్కున కారు తిప్పేశారు. అట్నించి అప్పుడే మలుపు తిరుగుతున్న ఓ యువతి కెవ్వున కేకేసి కారుక్రింద

పడడం అన్నీ ఒక్క క్షణంలో జరిగిపోయాయి. అప్పటికిగాని రంగారావు స్పృహకి రాలేదు. చటుక్కున కారాపి గబగబా దిగారు. అప్పటికి కారు చుట్టూ గుంపు మూగింది. అందరూ కలిసి కారుకింద పడిన యువతిని పైకి లాగారు. దెబ్బలు చాలాచోట కనిపించాయి. ఆ హఠాత్ సంఘటనకి మతిపోయి నిలబడ్డాడు రంగారావు- అంతా తలోమాట-అనడం మొదలుపెట్టాక చటుక్కున కర్తవ్యం గుర్తించి ఆమెని కారులో పడుకోపెట్టించి గబగబ తనకు తెల్సిన ఒక నర్సింగ్‌హోముకి తీసికెళ్లారు. తగిలిన గాయాలు అంత ప్రమాదకరమైనవి కాదని డాక్టరు ధైర్యం చెప్పేవరకు ఆయన మనసు స్థిమితపడలేదు. ఏక్సిడెంటు-అంటే అయనకి ఎంతో గుండె దడ ! ఈరోజు మళ్ళీ ఏక్సిడెంటు జరగడం-రక్తసిక్తమైన యువతి ! ఆయన కళ్ళు తిరిగినట్లయి అలా కుర్చీలో ప్రాలిపోయారు. ఒక గంట గడిచి ఆయువతికి తెలివి వచ్చిందన్న వార్త డాక్టరు చెప్పేవరకు ఆయన కోలుకోలేదు. అప్పుడు డాక్టరు వెంట ఆమెని చూడడానికి బయలుదేరాడు.

ఆయువతి వంటిని గాయాలకి దూది పెట్టి వుంది. మోపుగా తగిలినచేత బ్యాండెజ్ వేశారు. డాక్టర్ యింజక్షన్ యిచ్చాక కాస్త తగ్గింది. ఆమెని చూడగానే రంగారావుకి ఎక్కడో తెల్సిన మొహంలా-చూసిన మొహంలా అన్పించింది. ఎంత ఆలోచించిన ఎక్కడ ఎప్పుడు చూసింది. ఆయనకి గుర్తురాలేదు. బాధగా కళ్ళు మూసుకొని పడుకున్న ఆమె అడుగుల చప్పుడికి కళ్లు తెరిచింది. రంగారావుని చూడగానే ఆమె కళ్ళలోనూ ఆశ్చర్యం కన్పించింది. పోలిక గుర్తు దొరకగానే సంభ్రమంగా లేవబోయింది.

"ఆ.........ఆ.........కదలకు పడుకో అమ్మా —యీయన రంగారావు గారు వీరి కారు కిందే నీవు పడ్డావు- డాక్టరు పరిచయం చేశాడు. ఆమె తడబడ్తూ నమస్కారం చేసింది, "మీరు....మీరు....అంది రంగారావు ఖిన్నుడై" క్షమించండి- పరధ్యానంగా చూసుకోకుండా డ్రైవ్ చేశాను. నా వల్ల మీకు కలిగిన కష్టానికి చాలా విచారిస్తున్నాను. మీ వాళ్ళెవరో, ఎక్కడ వున్నారో చెపితే పంపిస్తాను. క్షమాపణ కోరుతూ అన్నాడు రంగారావు, ఆమెతో మాట్లాడుతున్న ఆయనకి ఆమెని ఎక్కడ చూసానా అని ఆలోచిస్తూనే వున్నాడు.

"అలా అనకండి - నాదీ తప్పే - నేనూ తల దించుకుని పరాకున నడుస్తున్నాను" "ఆయువతి ఆయన క్షమాపణకు సిగ్గు పడ్తున్నట్టు బిడియంగా అంది.

ఇలా అనుకోకుండా మళ్లీ మీ దర్శనం లభించింది–" ఆమె చాలా భక్తిగా, కృతజ్ఞతతో మరోసారి నమస్కరించింది. రంగారావు ఆశ్చర్యంగా.

"నేను మీకు తెలుసునా – మీరెవరు? నాకూ ఎక్కడో చూసిన గుర్తు వస్తూంది!"

"నన్ను మీరు అనకండి – మీ ఆశ్రయంలో బతికిన దానిని– మీ అన్నపూర్ణా అనాథాశ్రమంలో పెరిగి పెద్దదాన్నయ్యాను– నా పేరు శ్యామల. మా లాంటి నిర్భాగ్యులను ఆదుకునే పుణ్యాత్ములు మీరు. ఇన్నాళ్ళకి మీ దర్శనం లభించింది, యీ ఏక్సిడెంటు వలన—"అంది శ్యామల.

రంగారావుకి చటుక్కున గుర్తువచ్చింది. ఆయన మొహం విప్పారింది.... "ఆ....ఆ... నిన్ను అనాధశరణాలయంలో రెండు మూడుసార్లు చూశాను – ఇందాకటి నుంచి ఎక్కడ చూశానా అని ఆలోచిస్తున్నాను. నీ పేరు శ్యామల – ఆరోజు నీవు స్వయంగా నా ఎదుటికి వచ్చి ధైర్యంగా శరణాలయంలో జరిగే దురాగతాలన్నీ చెప్పావు గదూ....ఆ... నాకు బాగా గుర్తువచ్చింది. నీ విక్కడ ఎందుకున్నావు? ఇప్పుడు ఆశ్రమంలో వుండటంలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆశ్రమం వదలి ఏణ్ణర్థం అయింది నా చదువు పూర్తి అయి ఈ వూర్లోనే ఓ ఆఫీసులో చిన్న ఉద్యోగం దొరకగానే వచ్చేశాను. రంగారావు "నీకేం ఫరవా లేదు. నీకు పూర్తిగా నయమయేవరకు ఇక్కడే ఉందువుగాని– నేను డాక్టరుతో చెప్తాను...మీ ఆఫీసువాళ్ళకి కూడా చెప్తాను కొన్నాళ్లు శలవు కావాలని. నేను తర్వాత మరోసారి వస్తాను. నీకేం ఇబ్బంది ఉండదు. అంతా నేను చూస్తాను."అని అన్నాడు.

రంగారావు డాక్టరుతో అన్నీ మాట్లాడి ట్రీట్ మెంట్ అదీ సరిగా చూడమని చెప్పి ఖర్చుఅంతా తను పెట్టుకుంటానని అన్నీ మాట్లాడి వెళ్లారు.

* * *

ఆ రాత్రి రంగారావుకి చాలాసేపు నిద్రపట్టలేదు. ఆ ఏక్సిడెంటులో ఆయనకి పాత గాయం కెలికినట్లు యేదో అలజడి గుండెదడ కలిగి విశ్రాంతిగా పడుకోలేక పోయారు. అంతేకాదు, పదే పదే శ్యామల మొహం గుర్తురాసాగింది.

ఆయనకి మొదటిసారి శరణాలయంలో శ్యామలని చూసిన సంఘటన కళ్ళ ముందు కదలాడింది.

యధాప్రకారం సంవత్సరానికి ఒకసారి శరణాలయం చూడడానికి రాణితో